# 15. హిజ్ మాస్టర్స్ వాయిస్

**ఇప్పుడు** ఆడియో కేసెట్లు వచ్చేసి గ్రామఫోను రికార్డుల రికార్డులన్నీ బద్దలైపోయాయి గాని ఒకప్పుడు ఏదైనా పాట మళ్ళీ మళ్ళీ వినాలంటే గ్రామఫోను రికార్డులే ఆధారంగా సాగేది. అందులో ఓడియన్, కొలంబియా, ట్విన్స్, యంగ్ ఇండియా, ఇలాంటి పేర్లతో ఎన్నిరకాల గ్రామఫోను రికార్డులు తయారైనా, "హిజ్ మాస్టర్స్ వాయిస్" అనే ట్రేడు మార్కుతో వచ్చిన రికార్డులే ఎక్కువగా వచ్చేవి. ఆ రోజుల్లో ఇప్పుడున్నన్ని బ్రెయిన్‌టీజర్లు(చమత్కారమైన ప్రశ్నలు) లేకపోయినా ఒక కొశ్చన్ ఉండేది. అది "హిజ్ మాస్టర్స్ వాయిస్" ట్రేడు మార్కుకి సంబంధించిన ప్రశ్న. ఆ ట్రేడుమార్కు ఇప్పటికీ ఉంది. ఒక లవుడు స్పీకర్‌లోంచి వచ్చే నాదాన్ని ఒక కుక్క వింటున్నట్టుగా ఒక బొమ్మ ఆ ట్రేడు మార్కులో ఉంటుంది. ప్రశ్న ఏమిటంటేనూ, "హిజ్ మాస్టర్స్ వాయిస్ " ట్రేడు మార్కు బొమ్మలో ఉన్న కుక్క మగదా, లేక ఆడకుక్కా అని. కొద్దిగా కూడా ఆలోచించడానికి బద్ధకించేవాళ్లూ సరైన జవాబు చెప్పలేకపోతే వేళాకోళానికి ఆస్కారం వచ్చేస్తుందని భయపడేవాళ్లూ; 'నాకు తెలీదే' అని ఒప్పేసుకునే ప్రశ్న అది. ప్రశ్న వేసిన వాడికి జవాబు చెప్పేవాడు ఎప్పుడూ లోకువే అన్న ధర్మం ప్రకారం "ఓస్, ఇంతేనా నీ తెలివి!" అన్న నవ్వు; "హిజ్ మాస్టర్" అని ఉంది కనక ఆ కుక్క మగదే అని జవాబు (సీలు వేయని ఆన్సర్ ముక్తా) ఇంపు.

సహదేవరావు ఆలిండియా రేడియో సంస్థకి డిప్యూటీ డైరక్టర్ జనరల్‌గా ఉండే రోజుల్లో మొదట్లో కొన్నాళ్ళపాటు "వాయిస్" మీద తనకి ఉన్న "ఇంటరెస్టు " ప్రస్ఫుటంగా కనబడేటట్టుగా క్యాంపుల్లోనూ ఆఫీసులోనూ చెప్పేవారు. 'రేడియో అనే మీడియం 'వాయిస్' (కంఠస్వరం)కి ప్రాముఖ్యాన్ని ఇచ్చి మరీ పని చెయ్యాలి. ఎనౌన్సర్లు, న్యూస్ రీడర్లు, ప్రశ్నోత్తరాల కార్యక్రమాల్లో పాల్గొనే వారు ఉద్యోగుల్లో ఉంటారు. వీరు కాక శ్రవ్యనాటికల్లో పాల్గొనేవాళ్లు బయటి నుంచి వచ్చేవాళ్లుంటారు. వీళ్లందరికీ ఆడామగా తేడా లేకుండా (ఏం ఉన్నా ఏం లేకపోయినా సరే) తమది అని చెప్పుకో గలది కంఠ స్వరం చాలా ముఖ్యమైన అర్హత. "యువర్ వాయిస్ ఈజ్ యువర్ సెల్ఫ్" (నీ కంఠస్వరమే నీ చిహ్నం) అని ఆంగ్లంలో ఒక నానుడి. ఎవరింటికైనా వెళ్లి తలుపుకొట్టినప్పుడు లోపల్నించి "ఎవరూ? అనే ప్రశ్న వస్తే చాలా మంది 'నేను' అని చెప్పి పేరు చెప్పకుండానే తామెవ్వరో తెలియపరచగలగడం కంఠస్వరంలో ఉన్న ప్రత్యేకతే. చాలా ఎక్కువ మంది టెలిఫోన్‌లో మాట్లాడుతూ "హలో" అంటే చాలు, వారెవరో తెలిసిపోతుంది. మనిషిని పోలిన మనిషి ఉంటే ఉండొచ్చుకాని గొంతును పోలిన గొంతు చాలా చాలా అరుదు అని సిద్ధాంతం. అందుకనే గొంతులు మార్చి మాట్లాడడం ప్రధానాంశంగా చేపట్టే "మిమిక్" కళాకారుడవు తున్నాడు" (ఇదంతా సహదేవరావు స్పీచిలో భాగం కాదుగాని ఆయన అప్పుడప్పుడు అక్కడక్కడ వెలిబుచ్చిన అభిప్రాయాల క్రోడీకరణ అయితే కావచ్చు.)

అలా కేంపులు వెళ్లి వస్తూ ఉండే రోజుల్లో సహదేవరావు ఒసారి విజయవాడ వచ్చేరు. అప్పట్లో అక్కడ సంగీతం సాహిత్యం బాగా తెలిసిన ఒకాయన రేడియో స్టేషన్‌లో చాలా ముఖ్యమైన ఉద్యోగంలో ఉండేవారు. సహదేవరావు ఆయనతో మాట్లాడుతూ గాత్ర సంగీత విద్వాంసుల కంఠ

స్వరాలు టేపుల్లో భద్రపరచిన పద్ధతిలో కొందరు సాహితీ ప్రముఖుల కంఠస్వరాలు (వాయిస్‌లు) భద్రపరచే బాధ్యత మన సంస్థకి ఉంది కదా అన్నారు. "అవునండి. కృష్ణశాస్త్రిగారి గొంతు మూగపోకముందు ఆయన పద్యాలు ఆయనే చదవగా రికార్డు చేసిన టేపులున్నాయి. అలాగే విశ్వనాథ సత్యనారాయణగారిదీ కాటూరి వెంకటేశ్వరరావుగారిదీ, పింగళి లక్ష్మీకాంతంగారిదీ, ఇంకా చెళ్లపిళ్ల వెంకట శాస్త్రిగారిదీ ఇలా కొన్ని వాయిసెస్ ఈ స్టేషన్‌లో భద్రపరిచి ఉన్నాయండి." అని జవాబు వచ్చింది.

"మరి గుడిపాటి వెంకట "చలం"గారి వాయిస్ లేదా?"

"ఉన్నట్టు లేదండి"

"ఆయన ఆరోగ్యం అంత బాగున్నట్టు లేదు. పెద్దవారైపోయారు కూడాను. ఆయన తెలుగు సాహితీ స్రష్టల్లో ఒక అపురూపమైన ప్రత్యేకత గలవారు కదా. మన నిబంధనల ప్రకారం ఒక కథానికో లేకపోతే ఒక ప్రసంగమో ఇమ్మంటే ఇవ్వరాయన. అంచేత వీలున్నంత త్వరగా సమయం మించి పోకుండా ఒక ఇంటర్‌వ్యూ లాంటిది రూపొందించి ఆయన వాయిస్‌ని భద్రపరచండి." అన్నారు సహదేవరావు.

"అలాగేనండి. ఎవర్నయినా అరుణాచలం పంపి-"

సహదేవరావుకి "కొంచెం" కోపం వచ్చింది. ఉద్యోగ రీత్యా తాను అవతలాయన కంటే అధికుడు. అయినా అవతలాయన వయసుకి గౌరవం ఇచ్చి; "ఎవర్నో పంపడం కాదు; మీరే స్వయంగా వెళ్లి త్వరగా చలంగారితో ఇంటర్‌వ్యూ రికార్డు చెయ్యండి" అన్నారు. ఎంత మెల్లిగా చెప్పినా సహదేవరావు సందేశంలో తీవ్రత ఆయనకి అర్థమైన దానికి ఫలితంగా ఇవాళ గుడిపాటి వెంకటచలంగారి వాయిస్ మనకి లభ్యపదార్థంగా ఉంది.

ఆలిండియా రేడియోలోనే కాదు. కొందరికి కొన్ని సంస్థల్లో వాయిస్ (అంటే పలుకుబడి) ఉంటుంది. అది వేరే విషయం.

ఇంతకీ సహదేవరావు ఆలిండియా రేడియోలో డి.డి.జి గా పనిచేసింది "ప్రోగ్రాంస్" విభాగంలో కాక "ఎడ్మినిస్ట్రేషన్" విభాగంలోనే అయినా అతనికి ఆ సంస్థలో ఆ "వాయిస్" వచ్చింది.

ఆ రోజుల్లోనే ఒకసారి భారతదేశపు సుప్రీమ్‌కోర్టు ప్రధాన న్యాయమూర్తి హిదయతుల్లాగారు తాత్కాలిక ఉప రాష్ట్రపతిగా వ్యవహరించవలసిన అవసరం ఏర్పడింది. ఆ సందర్భంగా హిదయతుల్లాగారు జాతిని ఉద్దేశించి ఆకాశవాణి ద్వారా తమ సందేశాన్ని ఇయ్యడం సంభవించింది.

సంతర్పణలకి వంటలు చేసేవాళ్లు కూరలో, పులుసో, పులిహోరో సమంగా కుదిరేయో లేదోనని పంక్తికి ముందర కాస్త నాలిక్కి రాసుకోని చూడ్డం ఎక్కడైనా ఓ దగ్గిర జరక్కపోవచ్చుగానీ, రేడియోలో పనిచేసే ఉద్యోగులు, ముఖ్యంగా ప్రోగ్రాములకి సంబంధించిన వాళ్లు ఆయా ప్రోగ్రాములు ప్రసారం అవుతున్నప్పుడు తమ తమ రేడియో సెట్ల ద్వారా వాటిని వినవలసిన విధి ఒకటి అనుచానంగా వస్తున్నదే. అంచేత మర్నాడు ఉదయం ఆఫీసులో జరిగిన చిన్న డిపార్ట్‌మెంటల్ మీటింగులో ఒకపాటి పెద్ద అధికారిని ఉద్దేశించి "రాత్రి హిదయతుల్లా గారి స్పీచి విన్నారా?" అని అడిగేరు సహదేవరావు.

"విన్నాను గానండీ; ఆయన వాయిస్ అంత బాగాలేదండీ!" అన్నాడు ఆ అధికారి; మొదటి నుంచీ ఈ సహదేవరావుకి "వాయిస్"మీద ఉన్న అభిరుచిని గుర్తుచేసుకొని (కాబోలు.)

సహదేవరావుకి ఈసారి నిజంగా పెద్దకోపమే వచ్చింది. "హిదయతుల్లా ఈజ్ నాట్ లతామంగేష్కర్! మీరు హిదయతుల్లా గారి స్పీచిని ఆయన కంఠస్వరం కోసంకాక, ఆయన సందేశం కోసం వినడం మీ బాధ్యత!" అన్నారు.

ఆ అధికారి, హిజ్-మాస్టర్స్-వాయిస్ విని, అవునని చెప్పడానికి వాయిస్ (గొంతు) పెగలక; కాదని చెప్పడానికి మెసేజ్ (సందేశం) లేక...

❊

*("ఆంధ్రభూమి" డెయిలీ : 25-3-1992)*


*With best compliments from*

**Grams : Best Tractor**

**Phone : 22929 (O)**
**22625 (R)**

# SREE RAVI RAJ AGRO SERVICE

**N.H. 5 Road, Srikakulam - 532 001**

★

***Authorised Dealers :***

**HMT Tractors**
**( Sales, Service & Spare Parts )**

*For*

**Srikakulam &**
**Vizianagaram Districts**

*With best compliments from :*

Ph : 22929, 22625

# SREE RAMA AGRICULTURAL INDUSTRY

Registered as S.S.I. Unit

**Rama Laxmana Junction (N.H. 5 Road)**
**SRIKAKULAM - 532 001**

(Authorised Manufacturers of 4 Wheel &
2 Wheel Tractors)

and

Manufacturers of :
FULL WHEELS, PUDDLERS,
CULTIVATORS & ALL AGRIL. IMPLEMENTS

**Prop. M.Venkata Rao**